క్లుప్తంగా

అధిక విద్యుత్ బిల్లులు రద్దు చేయండి


ఏఈ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

రావికమతం : గిరిజనుల అధిక విద్యుత్ బిల్లులు రద్దు చేయాలని,గిరిజన గ్రామాలకు వంట గ్యాస్ సరఫరా చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో మండలంలో గల పలు గ్రామాల గిరిజనులు మండల రెవిన్యూ కార్యాలయం,మండల విద్యుత్ ఉప కేంద్రం వద్ద సోమవారం ఆందోళన చేశారు. చలిసింగంలో 20 కుటుంబాల వారికి నెలవారి విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయిని, వాస్తవంగా గిరిజనులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని, ఇళ్లలో రెండు బల్బులు, ఫ్యాన్, టీవీ మాత్రమే వాడుతున్నామని, వారంలో రెండు మూడు రోజులు విద్యుత్ సరఫరా ఉండదని, అయినా రూ.వేలల్లో కరెంట్ బిల్లులు రావడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు విద్యుత్ అధిక లోడుపై పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఈ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

ముగ్గురు పేకాట రాయుళ్లు అరెస్టు

నాతవరం : గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడులు చేశారు. నాతవరం ఎస్ఐ తారకేశ్వరరావు అందించిన వివరాలివి. చెర్లోపాలెం గ్రామంలో గుట్టు చప్పుడుగా పేకాట ఆడుతున్నట్టుగా సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేయగా ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారని, వారి వద్ద నుంచి రూ.8,400 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పోలీసుస్టేషన్‌కు తరలించి వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి


మాకవరపాలెంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి

మాకవరపాలెం: క్యాన్సర్ వ్యాధిపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి సూచించారు. స్థానిక పీహెచ్‌సీ, లచ్చన్నపాలెంలో సోమవారం మెగా వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలను ఆమె సందర్శించి క్యాన్సర్ వ్యాధిపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ రెండు శిబిరాల్లోనూ 290 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని వైద్యులు సీతారామలక్ష్మి, చరిష్మ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుల నిధులతో గండి పూడ్చివేత


పూడ్చిన పిరికి మదుం గట్టు

మాకవరపాలెం: సాగునీటి కాలువ గండిని రైతులే సొంత నిధులతో పూడ్చివేయించుకున్నారు. కొండలఅగ్రహారం వద్ద ఉన్న సర్పానది నుంచి మెరక, పల్లపు కాలువ ద్వారా తామరం, మాకవరపాలెం, నారాయణరాజుపేట భూములకు సాగునీరు అందాల్సింది. అయితే రెండేళ్ల క్రితం పిరికి మదుం వద్ద గట్టు గండిపడింది. దీంతో ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదు. రైతులే సొంత నిధులతో గండి ప్రాంతానికి మరమ్మతులు చేయించుకున్నారు.

జీఎస్టీ తగ్గింపుపై హర్షం

కె.కోటపాడు : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని పలు రకాలైన వస్తువుల ధరలపై తగ్గించి పేదలకు మేలు చేసినట్లు మండల బీజేపీ అధ్యక్షురాలు పైల అమ్మాజి, మాజీ డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి అన్నారు. జీఎస్టీ తగ్గింపుపై వీరు సోమవారం హర్షం తెలిపారు. మూడు రోడ్ల కూడలిలో బీజేపీ నాయకులతో కలిసి ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

గోవాడ సుగర్స్‌ను ఆదుకోండి

దేవరాపల్లి : ఎన్నికలకు ముందు గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆదుకుంటానని ప్రగల్భాలు పలికిన ఎంపీ సీఎం రమేష్, కూటమి ఎమ్మెల్యేలు ఇపుడు పట్టించుకోవడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న విమర్శించారు. దేవరాపల్లిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీ సి.ఎం.రమేష్‌కు వేసిన ఓటు, ఈ జిల్లాకు చేటు కలిగిస్తుందన్నారు. రైతులు నిలదీస్తారని భయంతో మహాజన సభకు సైతం మంగళం పాడేశారని ఎద్దేవా చేశారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు


ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న చర్చి సభ్యుడు జాన్

నర్సీపట్నం: సెంటినరీ బాప్టిస్ట్ చర్చికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో అవకతవకలు జరిగాయని చర్చి సభ్యుడు ఉడతపల్లి జానకి రామ్ ఆలియాస్ జాన్ ఆర్డీవో వి.వి.రమణకు సోమ వారం ఫిర్యాదు చేశారు. సంఘం సొమ్ము దుర్వినియోగంపై ప్రశ్నించినందుకు తనపై దాడికి పాల్పడ్డారని జాన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

జంక్షన్‌లో దుర్గంధం..

- కంపుగొడుతున్న ఘాట్‌రోడ్డు పరిసరాలు
- వర్షం కురిస్తే రోడ్డుపైకి డ్రైనేజీ మురుగునీరు
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రయాణికులు
- మోదకొండమ్మ పాదాలు ఆలయం వెనుకనే ప్రధాన డ్రైనేజీ
- 50 గ్రామాల ప్రజలకు ప్రధాన సమస్య
- పట్టించుకోని అధికారులు


నిత్యం రద్దీగా ఉండే ఘాట్‌రోడ్ జంక్షన్


మాడుగుల మండలం ఘాట్‌రోడ్ జంక్షన్ పాడేరు రోడ్డులో డ్రైనేజీ పూడిక పోయిన దృశ్యం

మాడుగుల : మండలంలో **నిత్యం ప్రయాణికులతో** అత్యంత రద్దీగా ఉండే **ఘాట్‌రోడ్ జంక్షన్‌లో** ప్రధాన డ్రైనేజీలు కూరు**కుపోవడంతో** డ్రైనేజీల్లో మురుగునీరు ఎటూ వెళ్లక **రోడ్డుపైకి వస్తోంది.** దీంతో ఇక్కడి వ్యాపారులు, **కొనుగోలుదారులు,** దారిన వెళ్లే ప్రయాణికులు **వాటి నుండి వచ్చే** దుర్వాసన భరించలేక గత **ఏడాదిగా ఇబ్బందులు** పడుతున్నారు. మండల **కేంద్రానికి చేరాలన్నా,** నిత్యావసర సరుకులు కొను**గోలు చేయాలన్నా,** విశాఖ, చోడవరం, జిల్లా **కేంద్రం ,అనకాపల్లి,** ఉన్నత విద్య కోసం వెళ్లా**లన్నా సుమారు 50** గ్రామాలకు చెందిన విద్యార్థులు, ప్రజలు ఈ ఘాట్‌రోడ్ జంక్షన్‌కు రావలసిందే. దీంతో రోజుకు **వేలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉండే ఘాట్‌రోడ్ జంక్షన్‌ను పట్టించుకోకపోవడం విచారకరమని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. రోజుకు 500 మంది ప్రయాణికులు జంక్షన్‌కు వచ్చి వెళ్తుంటారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఎంపీడీవో కె.కిరణ్‌ను సంప్రదించగా ఇప్పటికే ఒకసారి** డ్రేనేజీల్లో **పూడిక** తొలగించడం జరిగిందని మరో రెండు రోజులులో పూర్తి స్థాయిలో డ్రైనేజీలో పూడిక తొలగిస్తామన్నారు.

దుర్గంధం భరించలేం



మండలానికి ఘాట్‌రోడ్ జంక్షన్ ప్రధాన కూడలి. నిత్యావసర సరుకుల కొనుగోలుతో పాటు మాడుగుల, చోడవరం, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు, విశాఖ వెళ్లాలంటే ఘాట్‌రోడ్ జంక్షనే ప్రధాన కేంద్రం. ఇక్కడ **పాడేరు రోడ్డులో ప్రధాన** డ్రైనేజీ మురుగునీరు **చెత్తాచెదారంతో నిండి పోయిం**ది. వర్షం కురిస్తే **డ్రైనేజీల్లో మురుగు నీరు రో**డ్డుపైకి రావడంతో **దుర్వాసన భరించలేకపోతున్నాం.** అధికారులకు **ఫిర్యాదు** చేసినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఘాట్‌రోడ్‌లో ఉన్న డ్రైనేజీలు అన్నింటా పూడిక తొలగించాలి.

– పదాల అప్పలనాయుడు, ఎం. కోడూరు

బెల్ట్‌షాపులపై ఆర్డీవోకు ఫిర్యాదు


వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో వి.వి.రమణ

నర్సీపట్నం: బెల్టుషాపులను అరికట్టాలని కోరుతూ ప్రజాసంఘాల నాయకులు కె.త్రిమూర్తులరెడ్డి, ఎల్.గౌరి, కె.వి.సూర్య, సిఐటియు నాయకులు అడిగర్ల రాజు పీజీఆర్ఎస్‌లో ఆర్డీవో వి.వి.రమణకు ఫిర్యాదు చేశారు. కోట్ల రూపాయలు విలువ చేసే స్థలాలను కబ్జాచేసి నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇనాం భూమిగా నమోదైన భూమిని సరి చేయాలంటూ కోటవురట్ల మండలం, బి.కె.పల్లికి చెందిన పెట్ల అప్పలస్వామి నాయుడు అర్జీ పెట్టుకున్నారు. సర్వే చేసి తన భూమికి హద్దులు నిర్ధారించాలని మాకవరపాలెం మండలం, ఎం.కె.పట్నంకు చెందిన ఇ.అప్పలనాయుడు అర్జీ పెట్టుకున్నారు. సౌండ్ పొల్యూషన్ వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నర్సీపట్నం టౌన్ వెంకునాయుడుపేటకు చెందిన ఎ.వి. కిరణ్‌కుమారి ఫిర్యాదు చేశారు. పలు సమస్యలపై మొత్తం 22 ఫిర్యాదులు వచ్చాయి. పీజీఆర్ఎస్ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో ఆయాశాఖల అధికారులను ఆదేశించారు.

కొలువుదీరిన దుర్గమ్మ

- సంబరంగా దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- వాడవాడలా దుర్గాదేవి అమ్మవారి విగ్రహాల ప్రతిష్ట
- బాలా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనం
- చోడవరం దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి స్వర్ణాలంకరణ


చోడవరం దుర్గాదేవి ఆలయంలో స్వర్ణాలంకరణలో దుర్గాదేవి


కె.కోటపాడు : గుల్లేపల్లిలో దుర్గాదేవికి పూజలు


వీరవల్లి దత్తపీఠంలో చండీహోమం


కె.జె.పురం కళావేదికపై అమ్మవారికి పూజలు


రోలుగుంటలో దుర్గమ్మను వాహనంపై ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు


మాడుగులలో దేవితల్లిని దర్శించుకుంటున్న భక్తులు


బాలాత్రిపుర సుందరి అలంకరణలో వంటర్ల పాలెం కనకదుర్గమ్మ


బుచ్చెయ్యపేట : సీతయ్యపేట దుర్గామల్లేశ్వర్ల అమ్మవారు


పి.కె.గూడెంలో ఏర్పాటు చేసిన అమ్మవారు ప్రతిమ


దొండపూడిలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి


అప్పలరాజుపురంలో లలితాదేవికి పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న కౌన్సిలర్ పద్మావతి

చోడవరం: దసరా నవరాత్రి ఉత్సవాలు సోమ వారం నుంచి సంబరంగా ప్రారంభమయ్యాయి. ఒక పక్క భవానీ మాలధారణతో భక్తుల హడావిడి, మరో పక్క నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహాలు ప్రతిష్టలతో వాడవాడలా గ్రామాల్లో దసరా సందడి నెలకొంది. ప్రసిద్ధి గాంచిన చోడవరం దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు అమ్మవారు స్వర్ణాభరణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇక్కడి అమ్మవారి నిలువెత్తు విగ్రహానికి పసుపు కొమ్ముల దండలతో అలంకరించారు. ఆలయంతోపాటు మెయిన్‌రోడ్డు పొడవునా భారీ విద్యుత్ అలంకరణ చేయడంతో దసరా పండగ శోభతో ఈ ప్రాంతమంతా కనువిందు చేసింది. వెంకన్నపాలెం కొండపై వెలసియున్న కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు శ్రీ బాలత్రిపుర సుందరిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూలదండలు, నిమ్మకాయల దండలతో అమ్మవారిని అలంకరించారు. చోడవరం స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయంలో ఉపాలయంలో వేంచేసియున్న గౌరీదేవి ఆలయ ప్రాంగణంలో దసరా వేడుకలు ప్రత్యేక పూజలతో ప్రారంభమయ్యాయి. అమ్మవారి విగ్రహం ముందు ప్రత్యేకంగా అలంకరించిన దుర్గాదేవి అమ్మవారి విగ్రహాన్ని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించి బంగారం, ముత్యాల ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అంకుపాలెం దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఊరూరా దుర్గమ్మ విగ్రహాలను ఎంతో సందడిగా నెలకొల్పారు. వెంకన్నపాలెం జంక్షన్ వద్ద వందలాదిమంది భవానీభక్తులు బిందెలతో అమ్మవారికి ఊరేగింపు నిర్వహించారు. భవానీ భక్తుల భజనలతో ఎక్కడ చూసిన శరణుఘోషతో మారుమోగింది.

శ్రీదత్తపీఠంలో చండీహోమం

మాడుగుల రూరల్: శరనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వీరవల్లి అగ్రహారం గ్రామంలో గల శ్రీదత్తపీఠంలో చండీహోమం సోమవారం ప్రారంభించారు. దత్తపీఠాధిపతి దువ్వూరి శ్రీనివాస భరణిశర్మ సారథ్యంలో తొలి రోజు మాజీ ఉప సర్పంచ్ దాడి రాజేశ్వరావు, శశికళ దంపతులు ఈ చండీయాగంలో పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: దసరా శరనవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం వంటర్లపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించి, ఘటాలతో తీసుకొచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. గురు భవానీ దండి నర్సింగరావు, సర్పంచ్ అల్లాడ నాగేశ్వరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అమ్మవారిని బాలత్రిపుర సుందరిదేవిగా అలంకరించారు. భక్తులకు ఆలయం వద్ద అన్న సమారాధన చేశారు. కె.జె.పురం గ్రామ కళావేదిక మీద అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. పొంగలిపాక, కింతలి, వల్లాపురం, ఎ. వీరనారాయణం, జె.డి.పేట, జాలంపల్లి, వీరవల్లి అగ్రహారం, గాదిరాయి, వీరనారాయణం గ్రామంలో గౌరీశంకర ఆలయంలో, రామాలయంలో అమ్మవార్లను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు.

నాతవరం : పి.కె.గూడెంలో రామాలయం వద్ద అమ్మవారి ప్రతిమ ఏర్పాటు చేశారు. నాతవరం గ్రామంలో గల శ్రీశక్తి పంచాయతన ఆలయంలో అమ్మవారు బాల త్రిపుర సుందరీదేవి అవతారంలో దర్శనం ఇచ్చారు. మండల వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో భక్తులు భవానీదీక్షలు చేపట్టారు. ఎ.శరభవరం, నాతవరం, వెదురుపల్లి, గుమ్మడి గొండ, డి.యర్రవరం జంక్షన్ పి.జగ్గంపేట గ్రామాల్లో గల దుర్గాదేవి ఆలయానికి అధిక భక్తులు విచ్చేశారు.

బుచ్చెయ్యపేట : మండలంలోని సీతయ్యపేటలో దుర్గామల్లేశ్వర్ల అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తొలిరోజు అమ్మవారిని బాల త్రిపుర సుందరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. బుచ్చెయ్యపేట,లోపూడి, నీలకంఠాపురం,వడ్డాది,గౌరైపాలెం,పేట తదితర గ్రామాల్లో దుర్గాదేవి ఆలయాలతో పాటు మండపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

మాడుగుల : మాడుగులలో సోమవారం సివిల్ ఆర్‌టీసీ ఆటోఓనర్స్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో దేవీ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీనాదు శ్రీనివాసరావు, పరమేశ్వరి దంపతు లు కుటుంబ సమేతంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి తొలిపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రుద్రాభిషేక పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దేవీతల్లిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. సాయంకాలం ఆలయ ప్రాంగణంలో ప్రదర్శించిన శ్రీకృష్ణరాయభారం పౌరాణిక నాటకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఘనంగా సారె ఊరేగింపు

రావికమతం: మండలంలో దొండపూడి, రావికమతం, కొత్తకోట, మేడివాడ, గుమాళ్లపాడు, చినపాచిల, టి.అర్జాపురం తదితర గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాలను తప్పెటగుళ్ల, మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చారు.మహిళలు బిందెలతో పసుపు నీళ్లు తీసుకొచ్చి దుర్గాదేవి అమ్మవారి విగ్రహానికి జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేసారు.కొత్తకోటలో పిండి వంటలతో తయారు చేసిన సారెను తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

దేవరాపల్లి : గ్రామగ్రామాన దుర్గాదేవి అమ్మవారి విగ్రహాలను మహిళల కోలాటం, భవానీ మాలాధారణ భక్తులు శరణు ఘోషల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి మండపాల్లో ప్రతిష్ఠించారు. దేవరాపల్లిలో నాయుడు వీధిలో లవ్లీ బాయ్స్ ఆధ్వర్యంలోనూ, రైవాడలో ఎరకాలమ్మ ఆలయ ఆవరణలో గ్రామస్తుల ఆధ్వర్యంలో దుర్గాదేవి అమ్మవారిని విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు.

కె.కోటపాడు : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గుల్లేపల్లి గ్రామంలో స్థానిక ఆటో యూనియన్ ఆధ్వర్యంలో దుర్గాదేవి విగ్రహాన్ని కొలువుంచారు. దుర్గాదేవి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపుగా తీసుకొచ్చి దేవీ ఆలయంలో ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా ఆటో యూనియన్ సభ్యులు దసరా పండగకు తొమ్మిది రోజుల ముందుగా అమ్మవారిని ఆలయంలో ఏర్పాటు చేసి నిత్యపూజలను అందించనున్నారు. దుర్గాదేవి అమ్మవారి ఆటో యూనియన్ అధ్యక్షుడు కశిరెడ్డి రాంబాబు, ఉపాధ్యక్షుడు మలిరెడ్డి అప్పారావు, కార్యదర్శిలు కోళ్ల నాయుడు, దొంక రాజశేఖర్, వెంకట అప్పారావు, మలిరెడ్డి లక్ష్మణరావు పూజలు జరిపారు. వారాడ, పిండ్రంగి గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాలను ఏర్పాటు చేశారు.

రోలుగుంట: మండలంలో రోలుగుంట, కొండపాలెం, కుసుర్లపూడి తదితర గ్రామాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించేందుకు భవానీ భక్తులు పీఠం ఏర్పాటు చేశారు. అమ్మవారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రతిష్ఠించి పూజలు చేశారు.

దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో..

నర్సీపట్నం : దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి సన్నిధిలో భక్తులు మాలధారణ చేశారు. ఉత్సవాలను కౌన్సిలర్ పద్మావతి ప్రారంభించారు. ఆలయ చైర్మన్ నాగేంద్రరాజు, దేవదాయశాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ ఉమాదేవి, ఈవో సాంబశివరావు పాల్గొన్నారు.

చీడికాడ : అప్పలరాజుపురం లలితా దేవి ఆలయంలో దసరా నవరాత్రి మహోత్సవాలను సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు దంపతులు ప్రారంభించారు. సోమవారం అమ్మవారు త్రిపుర సుందరిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ఎంపీపీ జయమ్మ దంపతులు దర్శించుకున్నారు.


దేవరాపల్లిలో దుర్గాదేవి విగ్రహాన్ని ఊరేగింపు చేస్తున్న భక్తజనం


మాడుగుల : సత్యవరంలో దేవీ శరన్నవరాత్రి పూజలు


రైవాడలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న భవానీ దీక్షధారులు

భక్తిశ్రద్ధలతో భవానీ దీక్షలు


కె.జె.పురం కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భవానీ దీక్షల కోసం వేచి ఉన్న భక్తులు

మాడుగుల రూరల్: శరనవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని, కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో సోమ వారం భక్తులు మాలలు వేసుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎ. సుదర్శనాచార్యుల సారథ్యంలో సుమారు 1200 మందికి మాలాధారణ చేశారు. అదేవిధంగా ఆలయంలో శరనవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని 11 రోజుల పాటు అష్టలక్ష్మి పూజలు నిర్వహించనున్నారు. తొలిరోజు మహిళలు ఈ పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయంలో అన్నసమారాధన జరిపారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి


స్టాల్స్ పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

నాతవరం: రైతులంతా ప్రకృతి వ్యవసాయం సాగు చేయడంపై దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం రైతు సదస్సు సాధికారిత సంస్థ అధ్వర్యంలో సేంద్రీయ వ్యవసాయం ద్వారా రైతులు పండించిన కూరగాయలు పండ్ల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల ద్వారా రైతులు పండించిన కూరగాయలు ప్రతి సోమవారం ఉపాధి హామీ పథకం కార్యాలయం వద్ద స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయాలు చేస్తారన్నారు.

తాగునీటి సమస్య తీర్చండి...


వీరభద్రపేటలో నిరసనకు దిగిన గిరిజనులు

దేవరాపల్లి: చింతలపూడి పంచాయతీ శివారు వీరభద్రపేటలో తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానిక గిరిజనులు సోమవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. జల్‌జీవన్ మిషన్ స్కీమ్‌లో పైపులైన్లు ఏర్పాటు చేసి ఇంటింటి కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామంలో రోడ్డు నిర్మాణ పనుల్లో మంచినీటి పైపులైన్ ధ్వంసం కావడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో మంచినీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

గిరినాగు హల్‌చల్

దేవరాపల్లి : రైవాడ కాలువ సమీపంలో గిరినాగు సోమవారం హల్‌చల్ చేసింది. అటుగా వెళ్తున్న స్థానికులు సుమారు ఏడు అడుగుల గిరినాగును చూసి భయంతో పరుగులు తీశారు. వెంటనే ఈస్టర్న్ ఘాట్స్ వైల్డ్ లైఫ్ సొసైటీ బృంద సభ్యుడు కృష్ణకు సమాచారం అందించారు. హుటా హుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న కృష్ణ రక్త పొడ పామును మింగి కదలేని స్థితిలో ఉన్న గిరినాగును పట్టుకున్నారు.

గంజాయి రవాణాకు చెక్ పెట్టాలి


భీమవరం చెక్‌పోస్టు వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్ఐ రామారావు

గొలుగొండ: గంజాయి అక్రమ రవాణాకు పూర్తి స్థాయిలో చెక్ పెట్టడం కోసం సిబ్బంది పనిచేయాలని గొలుగొండ ఎస్ఐ తారకేశ్వరావు తెలిపారు. ఆయన సోమవారం కృష్ణదేవిపేట గ్రామ సమీపంలో ఉన్న భీమవరం చెక్‌పోస్టును పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ఏజెన్సీకు ముఖద్వారంగా ఉన్న భీమవరం చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి గంజాయి అక్రమ రవాణాపై నిఘా ఉంచాలన్నారు. చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరుతో పాటు ఇతర ఏజెన్సీ ప్రాంతాల నుండి కృష్ణదేవిపేటకు వస్తున్న ప్రతీ వాహనాన్ని క్షణ్ణంగా పరిశీలించి విడిచిపెట్టాలన్నారు. అనుమానిత వ్యక్తులపై నిఘా పెట్టాలని కోరారు. అలాగే భీమవరం చెక్‌పోస్టు పరిధిలో సుమారుగా రెండు కిలోమీటర్లు మేర ఉన్న ప్రాంతాలను డ్రోన్‌లో పరిశీలించారు. పరిసర ప్రాంతాలను డ్రోన్‌తో పరిశీలించి అనుమానిత ప్రాంతాలను గుర్తించారు.

చలో విశాఖకు పాడి రైతులు తరలిరండి


బుచ్చెయ్యపేటలో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న రైతు సంఘ నాయకులు

బుచ్చెయ్యపేట : పాడి రైతులకు న్యాయం జరగడం కోసం 24వ తేదీన చేపట్టిన చలో విశాఖ కార్యక్రమానికి పాడి రైతులు తరలిరావాలని రైతు సంఘం జిల్లా నాయకులు పి.సాంబశివరావు, డి.వి.నాయుడు కోరారు. బుధవారం గాజువాక దగ్గర అక్కిరెడ్డిపాలెంలో విశాఖ డెయిరీ జనరల్ బాడీ సమావేశం జరుగుతుందన్నారు. డెయిరీ అవినీతిపై వేసిన హౌస్ కమిటీ విచారణ బయట పెట్టి దోషులను శిక్షించి రైతులకు న్యాయం చేయాలని, లీటరుకు రూ.10 ధర పెంచాలని, మూడు నెలలకు ఒకసారి రైతులకు బోనస్ అందించాలని, మృతి చెందిన పాడి రైతు కుటుంబానికి పరిహారం అందించాలని, పశువులకు ఉచిత బీమాతో పాటు 75 శాతం రాయితీపై దాణా అందించాలని చలో విశాఖ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. 24న ఉదయం 10 గంటలకు పాడి రైతులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరుతూ గోడ పత్రికను విడుదల చేశారు.